సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యేలు శంకర నారాయణ, తిప్పేస్వామి
- 'జగనన్నే మా భవిష్యత్'కు అనూహ్య స్పందన



సోమందేపల్లి: జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



మడకశిరరూరల్: ప్రభుత్వ పాలనపై అభిప్రాయం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

సోమందేపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ కోరారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా శనివారం గుడిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలకు జరిగిన మంచిని వివరించారు. ఇళ్ల డోర్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ప్రజలను మభ్య పెట్టడానికి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, పాదయాత్ర పేరిట లోకేష్ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, స్థానిక నాయకులు రాజప్ప స్వామి, అమర్, కేశవ, ఇమామ్ వలి తదితరులు పాల్గొన్నారు.

- మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి భవిష్యత్‌కు మంచి మార్గం చూపిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వివరించారు. అమిదాలగొంది సచివాలయం పరిధిలోని హెచ్‌ఆర్ పాళ్యంలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలను వివరించి వారి అనుమతితో ఇంటి తలుపునకు స్టిక్కర్లు అంతికించారు. ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌న్ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, ఎంపీటీసీ కామరాజు, సర్పంచ్ గీత తదితరులు పాల్గొన్నారు.

- గుడిబండ: జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు కోరారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో పచ్చ కండువాలు వేసుకున్న వారికే సంక్షేమ పథకాలు అందించే వారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్, సర్పంచులు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, గౌరమ్మ, సచివాలయ కన్వీనర్ బోరప్ప పాల్గొన్నారు.

- రొద్దం: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శనివారం విస్తృతంగా నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు పాలనకు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడా చూడాలని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాయాల సమన్వయకర్త ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

- గోరంట్ల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు వివరించారు. అదే విధంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు.

- మడకశిరరూరల్: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని వివరించారు. వారి అనుమతిలో ఇంటికి స్టిక్కరు అంతికించి, ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను సేకరించారు. ప్రతి ఇంటి వారు గృహసారథులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. జగనన్న సీఎంగా ఉంటేనే పేదలకు కొండంత భరోసా ఉంటుందని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు బాబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న తదితరుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో కుటుంబానికి అందిన సంక్షేమ ఫలాలను వివరించారు. అలాగే మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ ఫోటో స్టిక్కర్లను డోర్లకు అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచ్ గిరిజమ్మ పాల్గొన్నారు.

- రొళ్ల: పేదల కళ్లలో ఆనందం చూడటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొడ్డేరి, హులికుంట, ఎం.రాయాపురం పంచాయతీలోని వివిధ గ్రామాలతో పాటు రొళ్ల-1 సచివాలయం పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రస్తుతం ప్రజలు నమ్మే స్థితిలో లేరని గుర్తు చేశారు.

- పరిగి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండలంలోని మోదా, కొడిగెనహళ్లి, హొన్నంపల్లి, ఊటుకూరు తదితర గ్రామాల్లో నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ సలీం పాల్గొన్నారు.

- పెనుకొండ రూరల్: భావితరాల భవిష్యత్తు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డు మహదేవపల్లి, 1వ వార్డు, ఇస్లాపురం, 2వ వార్డు వెంకటరెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రామాంజినేయులు, రఘునాథ రెడ్డి, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుట్టూరులో..

గుట్టూరు గ్రామంలో శనివారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిర్మల, నాయకులు నారాయణ స్వామి, సచివాలయ కన్వీనర్లు మహేంద్ర బాబు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని జీఐసీ కాలనీ, మహదేవపల్లి, వెంకటరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మెన్లు సునిల్, నందిని, జయశంకరరెడ్డి, వైఎసార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయన రసింహ, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, రామాంజినేయులు, నాయకులు బోయ బాబు, శ్రీరాములు, శంకరరెడ్డి, రాము, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

- మడకశిర: మున్సిపాలిటీలోని 20 వార్డుల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రెండో రోజు జోరుగా సాగింది. నాయకులు ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాలను వివరించారు. స్టిక్కర్లను అతికించారు.

- హిందూపురం: మండలంలోని చౌళూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి గడప గడపకూ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ పుస్తకంలోని ప్రశ్నలను అడిగి సమాధానాలను నమోదు చేశారు. అలాగే పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కొనసాగించారు. 19వ వార్డులోని బోయపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ పుస్తకంలోని ప్రశ్నలను అడిగి జవాబులను నమోదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, లోకేష్‌రెడ్డి, జాకీర్, చోటీ సాబ్, అశ్వర్థప్ప, గంగాధరప్ప, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



మోపురుగుండులో బోరు వేయించడంతో పుష్కలంగా వస్తున్న నీరు

గుడిబండ: మండల పరిధిలోని మోపురుగుండు గ్రామంలో ప్రజలు గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుడిబండ సర్పంచ్ కరుణాకర్‌గౌడు శనివారం గ్రామంలో బోరుబావి తవ్వించారు. 500 అడుగుల్లో నీరు పడ్డాయి. వెంటనే మోటరు బిగించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞలు తెలిపారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని చెరువు ప్రాంతంలో నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ ఆదినారాయణ పర్యవేక్షణలో శనివారం ఉదయం బోరు వేయించారు. నీరు సమృద్ధిగా రావడంతో తాగునీటి సమస్య తీరుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ సంఘం నాయకులు కోరారు. శనివారం వివిధ శాఖల ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వాలన్నారు. పెన్షన్లు అందజేసి, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సజ్జగంట రంగనాథ స్వామికి పూజలు



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే మాలగుండ్ల శంరనారాయణ పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త రామాకాంత్ రెడ్డి, అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, గ్రామ పెద్దలు రాజప్ప స్వామి, అమర్ తదితరులు పాల్గొన్నారు.


జేడీఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



జేడీఎస్‌లో చేరిన కార్మికులతో తిమ్మరాయప్ప

పావగడ: రాష్ట్రంలో జేడీఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్ప తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది వివిధ కార్మిక సంఘాల కార్మికులు జేడీఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిమ్మరాయప్ప మాట్లాడుతూ.. తాలూకాలో సైతం జేడీఎస్‌ను అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప మాట్లాడుతూ.. జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్పను అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బలరామరెడ్డి, ఎస్ఏ ఈరణ్ణ, గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ సభ్యుడిగా వెంకటేశ్



పావగడ: భారత ఆహార సంస్థ సభ్యుడిగా స్థానిక సీనియర్ జేడీఎస్ నాయకుడు సొగడు వెంకటేశ్ ఎంపికయ్యారు. స్థానిక తాలూకా పంచాయతీ సమితి అధ్యక్షుడిగా, జిల్లా పంచాయతీ ప్రణాళిక సంఘం సభ్యుడిగా, కర్ణాటక మీడియా అకాడమీ సభ్యుడిగా అందించిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పదవిని కట్టబెట్టింది. శనివారం బెంగళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో వెంకటేశ్‌కు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అజయ్ కుమార్ సింగ్ ఉత్తర్వులు అందించారు. అతడి ఎంపికపై మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, మానం వెంకటస్వామి, మైలారరెడ్డి తదితర జేడీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మడకశిర ఎస్ఐగా సురేష్ బాబు

మడకశిర: మడకశిర ఎస్ఐగా సురేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నాగేంద్రను పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఈ నేపథ్యంలో వీఆర్‌లో ఉన్న సురేష్ బాబును మడకశిర ఎస్ఐగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు

హిందూపురం: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రెండో సీఎంగా చెప్పుకునే ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, ఆయుబ్, నాగమణి, రహమత్‌బీ, రోషన్‌అలీ ప్రశ్నించారు. శనివారం సాయంత్రం ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ అవగాహన లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. హిందూపురం ప్రజలు ఎన్‌టీఆర్‌పై అభిమానంతో రెండు సార్లు ఓట్లు వేసి గెలిపిస్తే ఇక్కడి ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నాళ్లు పాలన పీఏలకు వదిలి సినిమాలకు పరిమితమై.. అప్పుడప్పుడు వచ్చి రెండు వేళ్లు చూపి వెళ్లడం తప్ప ఏం చేయలేదన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రత్యేక నిధులు తెచ్చి ఏం అభివృద్ధి చేశారో చూపాలన్నారు. ఒక రోడ్డు వేశారా వీధుల్లో అస్తవ్యస్తమైన డ్రైనేజీలు సరి చేశారా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన, ప్రభుత్వ బడ్జెట్‌పై ఎమ్మెల్యే బాలకృష్ణకే పరిజ్ఞానం లేదని విమర్శించారు. అసెంబ్లీలో పురం అభివృద్ధికి గళం విప్పడానికి అడుగు కూడా పెట్టని బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగనన్న, ఎమ్మెల్సీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన చేసిన అప్పుకు నేటికి రూ.63 లక్షల వడ్డీ హిందూపురం మున్సిపాల్టీ చెల్లించాల్సి వస్తుందని విమర్శించారు. అయితే ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హిందూపురంలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందిస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, మల్లికాబేగం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. జ్యోతుల ఉత్సవం



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి



జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా శనివారం సాయంత్రం అమ్మవారికి మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. కొల్హాపురి మహాలక్ష్మీ దేవి శాంతి స్వరూపిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయాన్నే అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి భక్తులు కానుకల రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. రత్నగిరి ఎస్సీ కాలనీవాసులు మేళతాళాలతో ఊరేగింపుగా బియ్యం పిండితో చేసిన జ్యోతులను మోసుకొచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి హారతులను సమర్పించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పోతులరాజు పూజ, పుష్పాలంకరణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తే చర్యలు



గోరంట్ల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

గుడిబండ: 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని డీవైఈఓ రంగస్వామి హెచ్చరించారు. శనివారం ఆయన మండంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మండలంలో మొత్తం 540 మంది విద్యార్థులకు గాను 530 మంది పరీక్షలకు హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు సెంటర్లు, కేజీబీవీలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఉదయం తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తనిఖీ చేశారు. సెంటర్ల వద్ద తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటును పరిశీలించారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 742 మంది విద్యార్థులకు గాను 735 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ నాగరాజు శనివారం తెలిపారు. 7 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ లేపాక్షి ఎంఈఓ నాగరాజు, చిలమత్తూరు డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు, ఎస్ఐ కరీమ్ బృందం పరిశీలించారు. అంతేకాకుండా లేపాక్షిలో 3, చిలమత్తూరులో రెండు, గోరంట్లలో 3 మొత్తం 8 పరిక్షా కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

గోరంట్ల: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం తహసీల్దార్ రంగనాయకులు పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అదే విధంగా పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మడకశిర: నియోజకవర్గంలో శనివారం 17 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరిగాయి. మొత్తం 3,146 మంది విద్యార్థులకు గాను 3,111 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మడకశిరలో 11, గుడిబండలో 10, అమరాపురంలో 11, రొళ్లలో ఒకరు, అగళిలో ఇద్దరు చొప్పున పరీక్షలకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం, చీపులేటి, మెళవాయి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు ఐరన్ మాత్రలు, బాలింతలు, గర్భవతులకు వైద్య చికిత్సలు సక్రమంగా నిర్వహించాలన్నారు. పౌష్టికాహారం ద్వారానే ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులు, కాయగూరలు, ఆకుకూరలను బాగా తినాలన్నారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ సేవలపై అవగాహన కల్పించారు.

మానవ హక్కుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా షమీవుల్లా

పెనుకొండ: అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా పెనుకొండకు చెందిన షమీవుల్లా నియమితులయ్యారు. ఆ సంస్థ చైర్మన్ మహమ్మద్‌షా చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జయరామప్ప, యువజన జిల్లా అధ్యక్షుడిగా మురళీ మోహన్ నాయక్, మైనార్టీ విభాగంలో జిల్లా అధ్యక్షుడిగా సిరాజుద్దీన్, సెక్రటరీగా గౌస్, జనరల్ సెక్రటరీగా చలపతి నియమితులయ్యారు.

క్రీడా మైదానం శుభ్రం

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానాన్ని శనివారం మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుభ్రం చేశారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆదేశాలతో ఇంటర్నేషనల్ డే ఆఫ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ పీస్ కార్యక్రమంలో భాగంగా క్రీడా మైదానం, పాఠశాలలోని పరిసరాలను శుభ్రం చేసినట్లు పీడీ రామాంజినేయులు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పరిగి: గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలను తప్పనిసరిగా నిర్వహిస్తామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్వరూపరెడ్డి తెలిపారు. ప్రధాన మంత్రి మాతృవందన సురక్షిత యోజన పథకంలో భాగంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి అర్బన్: ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పుట్టపర్తి మండలం జగరాజుపల్లి బస్టాండులో శనివారం చోటు చేసుకుంది. పుట్టపర్తి రూరల్ ఎస్సై దాదాపీర్ వివరాల మేరకు.. శనివారం సాయంత్రం గంటల మారెమ్మ కనువ వద్ద నుంచి పునాది రాళ్ల ట్రాక్టర్ కొత్తచెరువు వైపు వెళ్తోంది. జగరాజుపల్లికి చెందిన తిప్పారెడ్డి బస్టాండులో బస్సు కోసం వేచి ఉన్నాడు. ట్రాక్టర్‌ను డ్రైవర్ క్రం అదుపు చేయలేక పోవడంతో బస్టాండులోకి రాగానే బోల్తాపడింది. అక్కడే ఉన్న తిప్పారెడ్డిపై రాళ్లు పడడంతో కాళ్లు తీవ్రంగా దెబ్బ తినగా తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన్ను వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా రెండు కాళ్లకు చికిత్స చేసి తలకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఉత్సాహంగా రన్‌ఫర్ జీసెస్



రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

మడకశిరరూరల్: పట్టణంలోని సీఅండ్‌ఐజీఎం చర్చి నుంచి శనివారం ఉదయం క్రైస్తవులు, ఆ సంఘం సభ్యులు పట్టణంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులను ఆధ్యాత్మిక మార్గంలో ప్రోత్సహించడానికి రన్‌ఫర్ జీసెస్ నిర్వహించినట్లు పాస్టర్ దాస్ తెలిపారు.

హిందూపురం: ఏసుక్రీస్తు విశిష్ట, క్రైస్తవుల ఐక్యతను చాటి చెప్పడానికి రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం చేపట్టినట్లు పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు తెలిపారు. శనివారం గుడ్ ఫ్రైడే ఈస్టర్ పండగను పురస్కరించుకుని సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చ్, పాస్టర్ ఫెలోషిప్స్ సహకారంతో రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఈరన్న, పట్టణ పాస్టర్ ఫెలోషిప్స్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ డేవిడ్, రెవరెండ్ సూర్య ప్రకాష్, సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చ్ పాస్టర్ స్టీఫన్ రాజ్, కార్యదర్శి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జనార్ధన స్వామి?

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం బీజేపీ అభ్యర్థిగా చిత్రదుర్గం మాజీ ఎంపీ జనార్ధనస్వామి పేరు గట్టిగా వినపడుతోంది. ఇప్పటికే ఆ టికెట్‌ను ఆశిస్తూ స్థానిక లాయర్ కృష్ణానాయక్, కొత్తూరు హనుమంతరాయప్ప, శివకుమార్ సాకేల్ తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందులోనూ ఒక్క లాయర్ కృష్ణానాయక్ పేరు మాత్రమే ఎంపిక కమిటీకి వెళ్లినట్లు ప్రచారంలో ఉంది. దాదాపు 15 సంవత్సరాల నుంచి మూడు దఫాలు బీజేపీ టికెట్ కోసం ప్రయత్నాలు సాగించిన కృష్ణానాయక్ ఈ సారైనా టికెట్ దక్కుతుందనే ఆశతో ఉన్నారు. ఈ క్రమంలో జనార్ధనస్వామి పేరు తెరపైకి రావడంతో సందేహం నెలకొంది. కాగా.. జనార్ధనస్వామి అభ్యర్థిత్వానికి రాష్ట్ర అధిష్టానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈనెల 13న బీజేపీ అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

మృతుడికి నివాళి

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి తిప్పన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర నారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తిప్పన్న మృతదేహానికి నివాళులు అర్పించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి అర్బన్: పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి-1 (ఎస్టీ), పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి-1(బీసీ సి), పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి (బీసీ బీ) అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమందేపల్లి మండలం పెద్ద బాబయ్యపల్లి (బీసీ ఈ) మినీ అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. పెనుకొండ మండలం కొత్తపేట (ఎస్సీ), శ్రీరాములయ్య కాలనీ (ఓసీ), బి.టి.ఆర్ కాలనీ-2 (బీసీ బీ), దుద్దేబండ (బీసీ డీ), ఎర్రమంచి-1 (ఎస్సీ), వజ్రాలపేట (ఓసీ), రొద్దం మండలం రొద్దం-2 (బీసీ డీ), తురకలాపట్నం-2(బీసీ బీ), శేషాపురం-2 (ఓసీ), పుట్టపర్తి పట్టణంలోని జానకీరామయ్య కాలనీ(ఓసీ) సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాల కోసం పెనుకొండ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా నిడగల్లు మారెమ్మ దేవి ఊరేగింపు



నగోనపల్లిలో మారెమ్మ దేవిని ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని నగోనపల్లి గ్రామంలో శనివారం నిడగల్లు మారెమ్మ దేవిని భక్తులు ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామస్తులు గ్రామంలోని వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగించగా.. మహిళా భక్తులు గంగా జలాన్ని బిందెలో తీసుకొచ్చి అమ్మవారికి దారి పొడవునా ధార పోశారు. అనంతరం యాదవ కులస్తులు గొల్లహట్టిలో అమ్మవారిని కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.